# మనం

## నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం । 7 । జూన్ । 2026 పేజీలు: 7




# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- భద్రత, సమన్వయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: సీఎస్ రామకృష్ణారావు.
- వీడియో కాన్ఫరెన్స్‌లె జిల్లా అధికారులకు ఆదేశాలు

2



రాష్ట్రంలో నిర్వహించనున్న నీట్-2026 పరీక్షను ఎలాంటి అవాంతరాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని జిల్లాలు సమగ్ర ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో భద్రతా ప్రమాణాలు, సమన్వయం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి అదనపు డీజీపీ మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



# వార్డు సభలతో సమగ్ర అభివృద్ధి సాధ్యం

- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికకు ప్రజల సహకారం అవసరం.. కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.
- ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే వార్డు సభలు.
- 'జల్ సంచయ్-జల్ భాగీధారి' కింద వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపు.

ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కామారెడ్డి మున్సిపాలిటీ 40వ వార్డులో శనివారం నిర్వహించిన వార్డు సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు వార్డు సభలు వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.



2



### హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ను తలపించిన

# మిడ్‌నైట్ ఆపరేషన్

- గ్రామస్తుల సహకారంతో నలుగురు వాహన దొంగల అరెస్టు.
- 8 కిలోమీటర్ల ఉత్కంఠభరిత చేజింగ్.
- నాగిరెడ్డిపేట్ పోలీసులను అభినందించింది ఎస్పీ.

3

నాగిరెడ్డిపేట్ పోలీసులు, బ్లూ కోలట్స్ సిబ్బంది, గ్రామస్తుల సమన్వయంతో నిర్వహించిన మిడ్నైట్ ఆపరేషన్లో నలుగురు వాహన దొంగలను అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. అర్ధరాత్రి ప్రారంభమైన ఈ ఆపరేషన్ దాదాపు 8 కిలోమీటర్ల మేర ఉత్కంఠభరితంగా సాగి, హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ను తలపించింది. పోలీసుల కథనం ప్రకారం., గోపాలపేట గ్రామానికి చెందిన మహమ్మద్ సఫుద్దీన్కు చెందిన ఆటో (టీఎస్ 17 టీ 0997) జూన్ 3వ తేదీన తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు.

# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి



**- భద్రత, సమన్వయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: సీఎస్ రామకృష్ణారావు.**
**- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులకు ఆదేశాలు.**

కామారెడ్డి, జూన్ 06 (మనం జిల్లా ప్రతినిధి): రాష్ట్రంలో నిర్వహించనున్న నీట్-2026 పరీక్షను ఎలాంటి అవాంతరాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని జిల్లాలు సమగ్ర ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో భద్రతా ప్రమాణాలు, సమన్వయం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి అదనపు డీజీపీ మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**208 కేంద్రాల్లో పరీక్ష.**

ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ., రాష్ట్రవ్యాప్తంగా జూన్ 21న నిర్వహించనున్న నీట్-2026 పరీక్ష కోసం 24 పట్టణాల్లో 208 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 72,956 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని జిల్లాలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, రాష్ట్ర, జిల్లా స్థాయి సమన్వయ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థలలోనే పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**వదంతులపై అప్రమత్తంగా ఉండాలి.**

సోషల్ మీడియాలో పరీక్షలకు సంబంధించి వచ్చే వదంతులు, తప్పుడు ప్రచారాలపై వెంటనే స్పందించి వాటిని అరికట్టాలని అధికారులకు సూచించారు. ప్రశ్నపత్రాల రవాణా, అభ్యర్థుల నమోదు, బయోమెట్రిక్ ధృవీకరణ, తనిఖీలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల నేపథ్యంలో పరీక్ష నిర్వహణకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.




**వరి కొనుగోళ్లపై సమీక్ష**

సమావేశంలో వరి ధాన్యం కొనుగోళ్లపై కూడా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 4,488 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు పేర్కొన్నారు. 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాల్లో రూ.13,577 కోట్ల కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చెల్లించినట్లు వెల్లడించారు. మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

**మహిళా సమాఖ్యలకు 553 బస్సులు**

రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు ఒక్కో బస్సు చొప్పున మొత్తం 553 బస్సులు మంజూరు చేసినట్లు సీఎస్ తెలిపారు. ఈ బస్సులను జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు అందజేయనున్నట్లు చెప్పారు. సభకు సంబంధించిన ఏర్పాట్లు, మహిళా సభ్యుల తరలింపు అంశాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

**పాఠశాలల ప్రారంభానికి సిద్ధం కావాలి**

జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, ఇతర అవసరమైన సౌకర్యాల ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**సీసీ కెమెరాలతో నిఘా**

అదనపు డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ., పరీక్షా కేంద్రాలన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై నిరంతర నిఘా ఉంచి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళా అభ్యర్థుల తనిఖీల కోసం ప్రతి కేంద్రంలో మహిళా కానిస్టేబుళ్లను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

## వార్డు సభలతో సమగ్ర అభివృద్ధి సాధ్యం

**- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికకు ప్రజల సహకారం అవసరం.. కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**
**- ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే వార్డు సభలు.**
**- 'జల్ సంచయ్-జల్ భాగీధారి' కింద వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపు**



కామారెడ్డి, జూన్ 06 (మనం న్యూస్): ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కామారెడ్డి మున్సిపాలిటీ 40వ వార్డులో శనివారం నిర్వహించిన వార్డు సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు



వార్డు సభలు వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల మేరకు చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి మున్సిపాలిటీకి అందించాలని సూచించారు. 'జల్ సంచయ్-జల్ భాగీధారి' కార్యక్రమం కింద వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చి ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు కాలువల శుభ్రత, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, వీధిదీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, మున్సిపల్ కమిషనర్ టి. పర్వతాలు, తహసీల్దార్ హిమబిందు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## అక్షర జ్ఞానమే - సమాజ పురోగతికి మూలధనం

**- ఘనంగా ముదిరాజ్ ప్రతిభా పురస్కారాల వేడుక, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం.**
**- కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.**
**- చదువే నిజమైన ఆస్తి.. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం.. ఉమారాణి వ్యాఖ్య.**



కామారెడ్డి, జూన్ 06 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీ సీనియర్ సిటిజన్ హాల్లో నిర్వహించిన ముదిరాజ్ ప్రతిభా పురస్కారాలు - 2026 కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్




ముదిరాజ్ పాల్గొన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ., విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం. ఇది అజ్ఞానాన్ని తొలగించి ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని తీసుకువస్తుందని, నైతిక విలువలతో కూడిన సమాజాన్ని నిర్మిస్తుందని చదువే నిజమైన ఆస్తి అని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ ముదిరాజ్‌తో పాటు కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కాళ్ల గంగరాజు, కౌన్సిలర్లు కాళ్ల గణేష్, బాను, అరవింద్, నంద రమేష్, బిక్షపతి, నీలా నాగరాజు, లింబాద్రి, పరమేశ్వర్, బర్ల స్వామి, బట్టు నర్సింలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ను తలపించిన మిడ్‌నైట్ ఆపరేషన్

**- గ్రామస్తుల సహకారంతో నలుగురు వాహన దొంగల అరెస్టు.**

**- 8 కిలోమీటర్ల ఉత్కంఠభరిత చేజింగ్.**

**- నాగిరెడ్డిపేట్ పోలీసులను అభినందించింది ఎస్పీ.**



నాగిరెడ్డిపేట్, జూన్ 6 (మనం న్యూస్): నాగిరెడ్డిపేట్ పోలీసులు, బ్లూ కోలట్స్ సిబ్బంది, గ్రామస్తుల సమన్వయంతో నిర్వహించిన మిడ్నైట్ ఆపరేషన్లో నలుగురు వాహన దొంగలను అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. అర్ధరాత్రి ప్రారంభమైన ఈ ఆపరేషన్ దాదాపు 8 కిలోమీటర్ల మేర ఉత్కంఠభరితంగా సాగి, హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ను తలపించింది. పోలీసుల కథనం ప్రకారం., గోపాలపేట గ్రామానికి చెందిన మహమ్మద్ సపుద్దీన్కు చెందిన ఆటో (టీఎస్ 17 టీ 0997) జూన్ 3వ తేదీన తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నాగిరెడ్డిపేట్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇదే సమయంలో గోపాలపేట బస్టాండ్ సమీపంలో విధులు నిర్వహిస్తున్న బ్లూ కోలట్స్ సిబ్బంది రాత్రి 2.30 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనించారు. వారిని ప్రశ్నించేందుకు ప్రయత్నించగా, ఒక బైక్ను అక్కడే వదిలేసి ఇద్దరు వ్యక్తులు మరో బైపై వేగంగా పరారయ్యారు. వెంటనే బ్లూ కోలట్స్ సిబ్బంది పెట్రో కార్ పోలీసులకు సమాచారం అందించగా, సురేష్ గౌడ్, సుదర్శన్ తదితరులు వెంటాడారు. పోచారం సమీపంలో నిందితులను అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ వారు తప్పించుకుని ఎల్లారెడ్డి వైపు వెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్ఐ భార్గవ్ గౌడ్ స్వయంగా రంగంలోకి దిగి ఆపరేషన్ను పర్యవేక్షించారు. మాల్తుమ్మెద గ్రామ గేటు వద్దకు చేరుకున్న నిందితులు తమ వాహనాన్ని వదిలేసి పొలాల వైపు పరుగులు తీశారు. దీంతో మాల్తుమ్మెద ఉపసర్పంచ్ సహకారంతో గ్రామస్తులు, యువకులు రాత్రి 3 గంటల సమయంలోనే టార్చ్‌లైట్లతో గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. పోలీసుల ఒత్తిడిని తట్టుకోలేక నిందితులు తమ గ్యాంగ్లోని మరో సభ్యులకు సమాచారం అందించగా, వారు దొంగిలించిన ఆటోలో పోచారం చెరువు కట్ట ప్రాంతానికి చేరుకుని సహచరులను తప్పించేందుకు ప్రయత్నించారు. అయితే బ్లూ కోలట్స్ సిబ్బంది వారి కదలికలను గుర్తించి వెంటాడడంతో ఆటోను వదిలేసి వారు కూడా పరారయ్యారు. ఈ క్రమంలో మాల్తుమ్మెద, పోచారం, జక్కన్నపేట గ్రామస్తులు, యువకులు పోలీసులతో కలిసి విస్తృత గాలింపు చేపట్టారు. ముందస్తు వ్యూహంతో జక్కన్నపేట గ్రామ ప్రవేశ మార్గాల వద్ద గ్రామస్తులను అప్రమత్తం చేసిన పోలీసులు, అన్ని దారులను మూసివేసి చక్రవ్యూహం ఏర్పాటు చేశారు. చివరకు పోచారం సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. అతడిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు. విచారణలో నిందితులు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, మెదక్, నాగర్కర్నూల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో గతంలో కూడా పలు వాహన చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రెండు ఆటోలు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్లో విశేష ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఎస్ఐ భార్గవ్ గౌడ్, పీసీలు సురేష్ గౌడ్, వాజీద్, ఏఆర్పీసీ సుదర్శన్తో పాటు సహకరించిన మాల్తుమ్మెద, పోచారం, జక్కన్నపేట గ్రామస్తులను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించారు.




# వేధింపులు తట్టుకోలేక రెతు మృతి.. కేసు నమోదు



నిజామాబాద్ రూరల్, జూన్ 6 (మనం న్యూస్): ధర్పల్లి మండలంలోని గోవింద్పల్లి గ్రామానికి చెందిన కుంట గంగాధర్ (43) మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ధర్పల్లి ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం., గంగాధర్ వ్యవసాయంతో పాటు ఎలక్ట్రిషియన్గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గత నెలలో గ్రామంలో విద్యుత్ పనులు నిర్వహిస్తున్న సమయంలో ఓ వ్యక్తి గాయపడిన ఘటనకు సంబంధించి, గంగాధర్ను బాధ్యుడిగా చేస్తూ పరిహారం చెల్లించాలని కొందరు గ్రామస్తులు పలుమార్లు ఒత్తిడి తెచ్చినట్లు మృతుడి భార్య కుంట వసంత ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వేధింపుల కారణంగా మనస్తాపానికి గురైన గంగాధర్ మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొనగా, పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ జి. సందీప్ తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఆయన వెల్లడించారు.

# 161 జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**- ఒకరి మృతి. ఇద్దరికి తీవ్ర గాయాలు**

బిచ్కుంద, జూన్ 6 (మనం న్యూస్):: బిచ్కుంద మండలం పత్లాపూర్ గ్రామ శివారు 161 జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్న ఘటన లో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స కోసం బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు రెండు బైకులు ఎదురెదురుగా వచ్చి ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వారిలో జుక్కల్ మండలం కేమ్రాజ్ కల్లలి గ్రామానికి చెందిన పసుముల రమేష్ 35 కాగా గాయపడిన వారిలో ఒకరు కేమ్రాజ్ కల్లలికి చెందిన విఠల్ ఉపాధ్యాయుడు, మరో వ్యక్తి కేమ్రాజ్ కల్లలి గేట్ సమీపంలోని పంక్చర్ షాప్ లో మెకానిక్ గా పని చేసే మహబూబ్ లుగా స్థానికులు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.






# మున్సిపాలిటీ వార్డుల్లో వార్డు సభలు

ఎల్లారెడ్డి, జూన్ 6 (మనం న్యూస్):ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో శనివారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 4, 5 మరియు 6 వార్డులలో వార్డు సభలు నిర్వహించారు. వార్డుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మరియు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించి, ప్రజల నుండి సూచనలు మరియు వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి, వార్డుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు కమిషనర్ జె జగ్జీవన్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ, ఆరోగ్యశాఖ, వ్యవసాయ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు మరియు వార్డు కౌన్సిలర్స్ ప్రజలు పాల్గొన్నారు.

# ఫార్మర్ ఐడీతోనే భవిష్యత్ సంక్షేమ పథకాలు

**- రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి.**

**- వ్యవసాయ అధికారి సాయికిరణ్.**



నాగిరెడ్డిపేట్, జూన్ 6 (మనం న్యూస్): వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ తెలిపారు. ఆధార్ ద్వారా ప్రతి పౌరుడికి గుర్తింపు కల్పించినట్లుగానే, ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడీ) కేటాయించే ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. రైతుల భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారంతో ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందించబడుతుందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలైన పీఎం కిసాన్, రైతు భరోసా, ఎరువుల సబ్సిడీలు తదితర ప్రయోజనాలను ఫార్మర్ ఐడీతో అనుసంధానం చేసే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఫార్మర్ ఐడీ పొందేందుకు ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్ పుస్తకం, ఆధార్కు అనుసంధానమైన మొబైల్ నంబర్తో సమీప వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మీ సేవ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.శనివారం మండలంలోని అక్కంపల్లి గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట్ గౌడ్, వ్యవసాయ అధికారి సాయికిరణ్, గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు జాప్యంపై భగ్గుమన్న బిఆర్ఎస్

**రెవిన్యూ కార్యాలయం ముట్టడి**

భిక్నూర్, జూన్ 06 ( మనం న్యూస్ ): ధాన్యం (వడ్ల) కొనుగోలులో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ మండల బిఆర్ఎస్ నాయకులు శనివారం నాడు స్థానిక రెవిన్యూ కార్యాలయాన్ని (తహసీల్దార్ ఆఫీస్) ముట్టడించారు. కొనుగోళ్లు సాగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కంటితుడుపు చర్యలతో కాలయాపన చేస్తోందని, అన్నదాతలను నిలువునా ముంచుతోందని నాయకులు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. అధికారులు, ప్రభుత్వం అనుసరిస్తున్న పక్షపాత వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు.

**ఒక ఊరికే పరిమితమా..? నాయకుల నిలదీత**

ఇటీవల కలెక్టర్ రామేశ్వర్ పల్లి గ్రామానికి రాగానే, కేవలం ఆ ఒక్క గ్రామంలోనే యుద్ధప్రాతిపదికన వడ్ల కొనుగోళ్లు చేపట్టడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కలెక్టర్ వస్తేనే కొనుగోళ్లు చేస్తారా?' అని అధికారులను నిలదీశారు.

మండలం వ్యాప్తంగా ఉన్న మిగతా అన్ని గ్రామాల్లో వడ్ల కొనుగోలు ప్రక్రియను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు.



**చేతులెత్తేసిన అసమర్థ ప్రభుత్వం.**

రైతులను ఆదుకోవడంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని, ఇది ఒక 'అసమర్థ ప్రభుత్వం' అంటూ కార్యాలయం ఎదుట పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఐలండ్లలో (కొనుగోలు కేంద్రాల్లో) వారాల తరబడి రైతులు ఎదురుచూస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. అన్నదాత గోస పట్టని ఈ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ఓటమి రుచి చూపిస్తామని హెచ్చరించారు.

**అదనపు కలెక్టర్ హామీ.. ధర్నా విరమణ.**

బిఆర్ఎస్ నాయకులు, రైతుల ముట్టడితో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గిరి స్పందించారు. ఆయన స్థానిక తహసీల్దార్ ఫోన్ ద్వారా ధర్నా నిర్వహిస్తున్న నాయకులతో నేరుగా మాట్లాడారు. మండలంలో నిలిచిపోయిన ధాన్యాన్ని, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లను రాబోయే 48 గంటల్లో పూర్తిగా తరలిస్తామని ఆయన గట్టి హామీ ఇచ్చారు.

అదనపు కలెక్టర్ గిరి సానుకూల స్పందన మరియు 48 గంటల్లో ధాన్యం తరలిస్తామన్న స్పష్టమైన హామీతో బిఆర్ఎస్ నాయకులు తమ ధర్నా కార్యక్రమాన్ని తాత్కాలికంగా విరమించారు. ఇచ్చిన మాట ప్రకారం రెండు రోజుల్లో వడ్ల తరలింపు జరగకపోతే మరింత ఉధృతంగా పోరాడుతామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

---



## మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తకు తప్పిన ప్రమాదం

**బస్వాపూర్ వద్ద కారును ఢీకొట్టిన లారీ.**

బిక్కనూర్, జూన్ 6 ( మనం న్యూస్ ): నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తకు త్రుటిలో ఒక పెద్ద ప్రమాదం తప్పింది. శనివారం ఆయన ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ఒక లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఘటన వివరాల లోకి వెళ్తే స్థానిక వివరాల ప్రకారం., మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త హైదరాబాద్ నుండి నిజామాబాద్ వైపు తన కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో బిక్కనూర్ మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారుకు చేరుకోగానే, వెనుక నుండి అతివేగంగా వచ్చిన ఒక లారీ ఆయన కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు కొంతమేర దెబ్బతిన్నప్పటికీ, అదృష్టవశాత్తు కారులో ఉన్న మాజీ ఎమ్మెల్యేతో పాటు ఇతరులందరూ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న బిక్కనూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని, దాని డ్రైవర్ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. తమ ప్రియతమ నాయకుడికి ప్రమాదం జరిగిందనే విషయం తెలియగానే స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గణేష్ గుప్తను పరామర్శించి, ఆయన క్షేమంగా ఉన్నారని నిర్ధారించుకున్నాక ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం నాయకులు ఆయన కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, వేరే కారులో సురక్షితంగా నిజామాబాద్కు పంపించివేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

---

## విద్యార్థుల లక్ష్యసాధనకు కృషి, ఓర్పు అవసరం





**- ఛత్రపతి టీచర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్య క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు.**

**- 10వ తరగతి, ఇంటర్లో 90 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం.**

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులకు సత్కారం.**

కామారెడ్డి, జూన్ 06 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలో ఛత్రపతి శివాజీ పట్టాభిషిక మహోత్సవం సందర్భంగా ఛత్రపతి టీచర్స్ సొసైటీ (సీటీఎస్) ఆధ్వర్యంలో ఆర్య క్షత్రియ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్లో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు మెడిసిన్, ఇంజనీరింగ్లో సీట్లు పొందిన వారు, వివిధ ఉద్యోగాలు సాధించిన యువతను సన్మానించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, కౌన్సిలర్లుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా సీటీఎస్ అధ్యక్షుడు లోకోటి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా ఆర్య క్షత్రియ సంఘం అధ్యక్షుడు నిట్టు వెంకట్రావు మాట్లాడుతూ కృషి, ఓర్పుతో చదివితే ఉన్నత స్థానాలు సాధించవచ్చని సూచించారు. పట్టణ ఆర్య క్షత్రియ సంఘం అధ్యక్షుడు బాలాజీరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను గౌరవించే విద్యార్థులు జీవితంలో విజయాలు సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో సీటీఎస్ ప్రధాన కార్యదర్శి మధు, కోశాధికారి కమలాకర్ రావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పడిగల రాజేశ్వరరావు, ఎంఈవో నిట్టూరి ఆనంద్రావు, అంబీర్ మనోహర్రావు, సుమిత్ర ఆనంద్రావు, మున్సిపల్ కౌన్సిలర్లు నిట్టూరి గంగాధర్రావు, వినోద్రాజు పాటిల్, ఎస్ఆర్కే ప్రిన్సిపాల్ దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

---

## 14వ వార్డులో వార్డుసభ విజయవంతం

**ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల ఏర్పాటుతో నీటి సమస్య పరిష్కారం.. కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత.**





కామారెడ్డి, జూన్ 06 (మనం న్యూస్):-కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డ్ సభ ఎన్జీవోస్ కాలనీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత మాట్లాడుతూ., వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వలు లేకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా పొడి, తడి చెత్తను వేర్వేరుగా చేసి చెత్త బండిలో వేయాలని కోరారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే భూగర్భ జలాలు పెరిగి నీటి ఎద్దడి సమస్య తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వేణు ప్రసాద్, వార్డ్ ఆఫీసర్ వినయ్, డీసీసీ ఉపాధ్యక్షులు సబ్బని కృష్ణహరి, వార్డ్ పెద్దలు గంగారాం, కృష్ణారెడ్డి, శర్మ, మెహర్బాబా గౌడ్, రాజగౌడ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఎరువుల ధరలు తగ్గించి...
# ఎంఎస్పీ చట్టం అమలు చేయాలి

– పి. రామకృష్ణ.




నిజామాబాద్ రూరల్ జూన్ 6 (మనం న్యూస్): కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించడంతో పాటు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కి చట్టబద్ధత కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ డిమాండ్ చేశారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) జాతీయ మహాసభ పిలుపు మేరకు శనివారం సిరికొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పి. రామకృష్ణ మాట్లాడుతూ., కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అనుకూలంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. ఎరువుల ధరలను ఒక్కో బస్తాపై రూ.300 నుంచి రూ.500 వరకు పెంచడం వల్ల రైతులపై అదనపు భారం పడిందని అన్నారు. వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా ఎంఎస్పీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఇందిరా ఆత్మీయ రైతు భరోసా పథకం నిధులను సకాలంలో విడుదల చేయాలని కోరారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ మండల నాయకులు ఇ. రమేష్, బి. కిశోర్, ఏఐయుకేఎస్ జిల్లా కార్యదర్శి ఆర్. దామోదర్, జిల్లా నాయకులు బి. సర్పంచ్, మండల నాయకులు వి. భూమాగౌడ్, జి. కిరణ్, ఎన్. రాములు, ఎస్. గంగాధర్, పి. ఎల్లయ్య, జె. రాజు, ఎం. పండరి, ఎన్. చిన్నరాజన్న, ఇ. రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




## జేఈఈ అడ్వాన్స్‌లో మెరిసిన సత్యశోధక్ పూర్వ విద్యార్థులు.

నిజామాబాద్ రూరల్, జూన్ 6 (మనం న్యూస్):దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీ ప్రవేశ పరీక్ష జేఈఈ అడ్వాన్స్డ్-2026 ఫలితాల్లో సత్యశోధక్ పాఠశాల పూర్వ విద్యార్థులు విశిష్ట ర్యాంకులు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. గిరిజన (ఎస్టీ) విభాగంలో జి. శ్రీకాంత్ 797వ ర్యాంకు, డి. నీరజ్ రాథోడ్ 1958వ ర్యాంకు సాధించగా, ఓబీసీ విభాగంలో కె. దామోదర్ 4005వ ర్యాంకు, జి. విక్రం 4913వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటారు. ఒకే పాఠశాలకు చెందిన నలుగురు పూర్వ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్డ్లో ఉత్తమ ర్యాంకులు సాధించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సత్య శోధక్ పాఠశాల ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్. నర్సయ్య విద్యార్థులను ప్రత్యేక జ్ఞాపికలతో సన్మానించి అభినందించారు. కృషి, క్రమశిక్షణ, సరైన ప్రణాళికతో చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల విజయాలు ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, రాజేశ్వర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వాగులు, ఒర్రెలే అడ్డాగా అక్రమ ఇసుక రవాణా

– చర్యలు తీసుకోవాలని స్థానికుల ఆవేదన.

కమ్మర్ పల్లి, జూన్ 6 (మనం న్యూస్): కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని కోనాపూర్, పలు గ్రామాల శివారులో ఉన్న అటవీ ప్రాంతం లో అక్రమ ఇసుక రవాణాచేస్తున్నట్లు అడ్డాగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. కొండల మధ్యలో ఒర్రెలు, వాగులు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో భారీ స్థాయిలో ఇసుక నిల్వలు ఉండటంతో కొంతమంది అక్రమ దందాదారులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. ప్రతిరోజూ తెల్లవారుజామున నుంచి రాత్రి వేళల వరకు అడవి మార్గాల గుండా ట్రాక్టర్లు సంచరిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అడవిలో జరుగుతున్న ఈ అక్రమ రవాణా వల్ల ప్రకృతి సంపద నాశనమవుతుండటమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇసుక అక్రమ రవాణా కారణంగా అడవి మార్గాలు దెబ్బతింటుండగా, పర్యావరణ సమతుల్యత కూడా ప్రమాదంలో పడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నత స్థాయి మైనింగ్ శాఖ అధికారులు, ఫారెస్ట్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## సంక్షేమ పథకాలపై విశ్వాసంతో కాంగ్రెస్ గూటికి రాఘవపల్లి నేతలు

నాగిరెడ్డిపేట, జూన్ 6 (మనం న్యూస్): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సమక్షంలో నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లి గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ నర్ల గంగామణి మల్లేష్తో పాటు ఉపసర్పంచ్ సూరయ్య, వార్డు సభ్యులు సురేందర్, బాలమణి వెంకయ్య, ఇందిరవ్వ పాపయ్య, చాకలి రుక్మిణి గంగయ్య, భాస్కర్, మాలావత్ రమేష్ తదితరులు కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ., ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పార్టీలో చేరిన నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్తో కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ., ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు ప్రకటిస్తూ పార్టీలో చేరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు క్రిస్టోఫర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా సవరణపై బూత్ ఏజెంట్లకు శిక్షణ




నిజామాబాద్ రూరల్, జూన్ 6 (మనం న్యూస్): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి క్యాంపు కార్యాలయం వెల్లడించింది.

తెలంగాణలో జూన్ 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో, నియోజకవర్గ పరిధిలోని 293 పోలింగ్ కేంద్రాల బూత్ స్థాయి ఏజెంట్లకు ఆదివారం ఉదయం 10 గంటలకు ధర్మారం అమృత గార్డెన్స్లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు బూత్ ఏజెంట్లందరూ తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి హాజరుకానుండగా, ముఖ్య శిక్షకుడిగా కె. నాగరాజు గౌడ్ పాల్గొంటారు. రాష్ట్ర గీతా పారిశ్రామిక సహకార కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి తదితరులు హాజరుకానున్నారు.



## అగ్నివీర్ ఉద్యోగం సాధించిన రెంజల్ యువకులకు ఘన సన్మానం

రెంజల్, జూన్ 6 (మనం న్యూస్): దేశ సేవకు అంకితమవుతూ అగ్నివీర్లో ఉద్యోగం సాధించిన రెంజల్ గ్రామానికి చెందిన యువకులు గంగప్రసాద్, శివానంద్లను గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ తిరుపతి లలిత బుజ్జి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ., గ్రామ యువత కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అగ్నివీర్లో ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని పేర్కొంటూ, యువకులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకుని దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి, ఉపసర్పంచ్ మానస రాకేష్, వార్డు సభ్యులు సంతోష్, రాజు, శ్రీకాంత్, శ్రీను, రజాక్, కర్కెళ్లి గంగాధర్ వ్యవసాయ అధికారి ప్రసాద్, మిషన్ భగీరథ ఏఈ, హౌసింగ్ ఏఈ సాయికిరణ్, రెవెన్యూ అధికారి ఆర్ఐ, సెక్రటరీ, ఐకేపీ భాస్కర్, సీఏలు, అంగన్వాడీ సిబ్బంది, జీపీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని యువకులను అభినందించారు.



## రెంజల్ గ్రామసభలో ప్రజా సమస్యలపై చర్చ

రెంజల్, జూన్ 6 (మనం న్యూస్): రెంజల్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం గ్రామసభ సమావేశంను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తిరుపతి లలిత బుజ్జి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ, పచ్చదనం పెంపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ ప్రజలు తమ సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామసభలో వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి, ఉపసర్పంచ్ మానస రాకేష్, వార్డు సభ్యులు, వ్యవసాయ అధికారి ప్రసాద్, మిషన్ భగీరథ, హౌసింగ్, రెవెన్యూ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని తమ సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# బుస్సాపూర్ గ్రామసభలో అభివృద్ధి అంశాలపై చర్చ

### - ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు - అధికారులు



మెండోరా, జూన్ 6 (మనం న్యూస్): మెండోరా మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో శనివారం గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, భవిష్యత్ అభివృద్ధి పనులపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

గ్రామస్తులు తమ సమస్యలు, అవసరాలను



అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ తగిన చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూత్పల్లి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సతీష్, సెక్రటరీ భోజేందర్ ,వార్డు సభ్యులు,మండల స్పెషల్ ఆఫీసర్ ఆంజనేయులు, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ్, ఎస్త్రు సుహాసిని, ఏపీఓ, ఏఈ, మిషన్ భగీరథ ఎంబీ, ఎంఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్, సీసీ, ఐకేపీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామసభలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై తీర్మానాలు ఆమోదించి, వాటి అమలుకు కార్యాచరణ రూపొందించారు. గ్రామసభ ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# కోనాపూర్‌లో గ్రామ సభ





బీబీపేట్, జూన్ 6 (మనం న్యూస్): బీబీపేట మండలంలోని కోనాపూర్ శనివారం గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగింది. రాబోయే వర్షకాలంలో పాటించవలసిన పరిశుభ్రత, త్రాగునీరు, పిచ్చిమొక్కల తొలగింపు వంటి విషయాలపై చేర్చించడం జరిగింది. ఈ సంధర్బంగా ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ మాట్లాడుతూ., ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహించడం జరిగిందని ఇందులో భాగంగా వర్షాకాలంలో మొక్కలు నాటుట, విద్యుత్ మరమ్మత్తులు, పంట మార్పిడి, జిపిడిపి ప్లాన్, అంశాలపై చర్చించినట్టు ఆయన తెలిపారు. సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్లును, గ్రామంలో ఉన్న గుడిసెలను పరిశీలించడం జరిగింది .ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేష్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, అగ్రికల్చర్ ఆఫీసర్ నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి భరత్, జిపిఓ స్వామి, ఏపీఎం, వివోలు, ఆశ వర్కర్లు, అంగన్వాడీలు, విద్యుత్ అధికారులు, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# హాస కొత్తూరులో సామూహిక ఇందిరమ్మ గృహ ప్రవేశాలు





కమ్మర్ పల్లి, జూన్ 6 (మనం న్యూస్) : కమ్మర్ పల్లి మండలం హసా కొత్తూరు గ్రామంలో సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాల కార్యక్రమం గ్రామ సర్పంచ్ నలిమెల రేవతి గంగారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, మండల రెవెన్యూ అధికారి స్పెషల్ ఆఫీసర్ నరేష్ , కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భువనగిరి భాస్కర్, పంచాయతీ కార్యదర్శి నల్లగంటి నర్సయ్య, ఉపసర్పంచ్ ఏనుగు మనోహర్ వార్డు సభ్యులు కుందేటి శ్రీనివాస్, గంగాధర్, కనుక నర్సయ్య, కల్లెడ రాణి, కల్లెడ కాశవ్వ, పసుల గంగు ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోపిడి లింగారెడ్డి మోదిని శ్రీధర్, కల్లెడ లలిత, మంద భాగ్యలక్ష్మి, సిసి అలేఖ్య, కాంగ్రెస్ నాయకులు ఏలేటి గంగాధర్, మండ పల్లి మహేందర్ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రేకులపల్లిలో విషాదం

**– కరెంట్ షాక్తో బర్రె మృతి, కాపరి తీవ్ర గాయాలు.**

నిజామాబాద్ రూరల్, జూన్ 6 (మనం న్యూస్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ధర్పల్లి మండలం రేకులపల్లి గ్రామంలో శనివారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గంగాధర్ వ్యవసాయ పొలంలో విద్యుత్ నిర్లక్ష్యం కారణంగా ఒక బర్రె కరెంట్ షాక్కు గురై మృతి చెందింది. అదే ఘటనలో బర్ల కాపరిగా పనిచేస్తున్న వ్యక్తి కూడా విద్యుత్ షాక్కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై గాయపడిన వ్యక్తిని అంబులెన్స్ ద్వారా నిజామాబాద్



ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతనికి చికిత్స అందుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. వ్యవసాయ పొలాల్లో, విద్యుత్ లైన్ల



సమీపంలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జాతీయ లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలి

**– పోలీస్ కమిషనర్ సాయి చైతన్య.**



నిజామాబాద్, జూన్ 6 (మనం బ్యూరో): ఐజాతీయ లోక్ అదాలత్ ఈ నెల 20న నిర్వహించినట్లు పత్రిక ప్రకటన ద్వారా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ను ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య కోరారు. ట్రాఫిక్ చలానాలు, చిన్నపాటి క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు వంటి అంశాలను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు.కోర్టుల్లో పెండింగ్లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవడంతో పాటు సమయం, ఖర్చు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. పరస్పర రాజీ ద్వారా సమస్యలకు శాంతియుత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. 'రాజీ మార్గమే - రాజ మార్గం' అనే నినాదంతో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్లో పాల్గొని ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన మానాల మోహన్ రెడ్డి

కమ్మర్ పల్లి, జూన్ 6 (మనం న్యూస్): కమ్మర్ పల్లి మండలంలోని హాస కొత్తూరు గ్రామంలో పలు బాధిత కుటుంబాలను రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్త వడ్ల రమేష్ నాన్న, ఏనుగు రాజేశ్వరు నాన్న ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండల అధ్యక్షులు మాజీ మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ, వివిధ గ్రామ సర్పంచులు, ఉపసర్పంచ్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






## శివాజీ రాజ్యాభిషేక దినోత్సవం



ఎల్లారెడ్డి, జూన్ 6 (మనం న్యూస్): ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలో శనివారం చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలవేసి శివాజీ మహారాజ్ 1674 జూన్ 6 న మహారాజుగా పట్టాభిషిక్తుడైన రోజున శివాజీ రాజ్యాభిషేక దినోత్సవంగా జరుపుకుంటూ హిందూధర్మరక్షణ చేస్తూ సనాతన ధర్మాన్ని కాపాడిన మహనీయుడైన ఆయన చేసినటువంటి ధర్మ కార్యక్రమాలను మరియు ఆయన సాధించిన విజయాలను సమాజంలో ఆయన నడుచుకున్న విధానాన్ని ధర్మం కోసం ఎక్కడైన ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలని ఆ శివాజీ మహారాజ్ ను గుర్తు చేసుకుంటూ భారత దేశంలో హిందువులై పుట్టినందుకు వారి ఆశయాలను కాపాడాలని హిందూ ధర్మం కోసం ప్రతి హిందువు సమయం ఇవ్వాలని దేశం కోసం ధర్మం కోసం పాటుపడాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మరియు బజరంగ్దళ్ నాయకులు నవీన్, తులసి దాస్, వినోద్, రాహుల్, హర్ష, సందీప్, పురుషోత్తం, శివలతో పాటు ఎల్లారెడ్డి పురపాలక సంఘం వార్డ్ కౌన్సిలర్స్ విద్య సాగర్, శ్రీధర్ పాల్గొన్నారు.

## మురికి నీరు తొలగించండి

బోధన్, జూన్ 6 (మనం న్యూస్): బోధన్ పట్టణం 16 వ వార్డు హరిజనవాడ ప్రాంతంలో మున్సిపల్ డ్రైనేజ్ లోని మురికి నీరు నిలువ ఉండడం వలన కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వార్డులోనీ బిటి నగర్ రోడ్ కు వెళ్ళేదారిలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద గృహ నిర్మాణం చేపడుతున్న ఇంటి యజమాని ఇసుక డ్రైనేజీలో పడడంతో డ్రైనేజీకి ఇరువైపుల మురికి నీరు నిలిచి పోయింది. దీని వలన దోమలు గుడ్లు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. మున్సిపల్ అధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి డ్రైనేజీని శుభ్రం చేయాలని మురికి నీరు తొలగించాలని కాలనివాసులు కోరుతున్నారు.



## ధర్పల్లి ఎస్హెచ్ఓగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సందీప్



నిజామాబాద్ రూరల్, జూన్ 6 (మనం న్యూస్): ఇటీవల జరిగిన పోలీసు శాఖ బదిలీలలో భాగంగా ఇందల్వాయి పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓగా విధులు నిర్వహించిన ఎస్ఐ సందీప్ ధర్పల్లి పోలీస్ స్టేషన్కు బదిలీపై వచ్చి శనివారం ఎస్హెచ్ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అసాంఘిక, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ స్టేషన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, నేరాల నియంత్రణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్ఐ జి. సందీప్ పేర్కొన్నారు.

## బిచ్కుందకు 5 ప్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూరు

**– ఎంఈఓ శ్రీనివాసరెడ్డి**




బిచ్కుంద, జూన్ 6 (మనం న్యూస్):ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు బిచ్కుంద మండలానికి 5 ప్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూరైనట్లు ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రాథమిక గణేష్ మందిర పాఠశాల, పుల్కల్, వాజీద్ నగర్, గుండె నెమలి, పెద్ద దద్ది బడుల్లో ఇవి ప్రారంభం కానున్నాయి. వీటి నిర్వహణకు ప్రత్యేక ఇన్స్ట్రక్టర్లను, ఆయాలను నియమించనున్నట్లు విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

## మూడు ప్రీ-ప్రైమరీ కేంద్రాలకు సిబ్బంది నియామకాలు

నాగిరెడ్డిపేట, జూన్ 6 (మనం న్యూస్): నాగిరెడ్డిపేట మండల పరిధిలోని జప్తి జానకంపల్లి, లింగంపల్లి కలాన్, మేజర్వాడి గ్రామాల్లో మూడు ఉచిత ప్రీ-ప్రైమరీ తరగతులు మంజూరు అయ్యాయి. ఈ కేంద్రాల్లో ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు మరియు ఆయాల నియామకాలను తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టనున్నట్లు మండల విద్యా అధికారి వెంకట్ రెడ్డి తెలిపారు.

అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను పూర్తి చేసి, అవసరమైన విద్యార్హతల ధ్రువపత్రాల ప్రతులను జతచేసి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా మండల విద్యాశాఖ అధికారికి సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుల స్వీకరణ జూన్ 6, 2026 నుంచి జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని విద్యా అధికారి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.